# "ఛీ యవ్వ! గాల్ల కాల్లు మొక్కుడా !"

**బువ్వ** దిని మంచంల పన్న. కొద్దిగంతసేపు వయిలు[63] సదివిన. అటెనుక ఎంత బొర్లినా పొద్దు గడువలె. ఇగ లాబంలేదని అంగి తొడుక్కోని లచ్మారెడ్డింటి మొకాన నడుత్తన్న. ఆల్లింటికి పొంగ **తొవ్వల్నే** లింగయ్యల్లుంది. ఆ కిట్ల మంచంల కూసున్నడు లింగయ్య. నేసిన బనీను తొడుక్కోనున్నడు. మంచంకింద తాగిన సుట్టుంది. అయినె మంచం దగ్గర్నే లింగయ్య పెండ్లం శాంతమ్మ కూసున్నది. కొడుకు శెంకరయ్య అక్కన్నే ఉన్న ఇంకో మంచంలం కూసుండున్నడు. లింగయ్య పక్కకే అయినె సోపతికాల్లిద్దరు ముసలోల్లు కూసున్నరు. శెంకరుడి పెండ్లాం ప్రమీల అత్త పక్కన కూసున్నది. ఆల్లందరేదో మాట్లాడుకుంటంద్రు. నన్ను జూసి శెంకరయ్య రమ్మని సెయ్యూపిండు. నేం బొయ్యిఅ యినె పక్కన కూసున్న. లింగయ్య, శెంకరయ్యడగిన కుశెల ప్రశ్నెలకు జెవాబులు సెప్పిన.

"నీ మనుమరాలు వరవ్వకు పదిగేను పదారేండ్లు లెవ్వానె లింగన్న. ఇంకెప్పుడు లగ్గం జేత్తవే? పొల్ల పడుసుదయిపాయె. ఎనుకట్నయితె పెద్ద మనిషయినంక లగ్గంజేత్తె కులతప్పు వెడుతరు" అన్నడు లింగయ్య సోపతికాడు రాజమల్లు.

"గిప్పుడు గవ్వన్నున్నాయి. పొల్ల సదువుకుంటందని ఆగిండేమో నీ కొడుకు. గంతేకాదె లింగన్న. అయినె సదువుపంతులేనాయె. గాయింత తెలువదా? ఒగల్జెప్పన్నా గయినెకు" అన్నడు వెంకటయ్య.

"సదువుకున్నోల్లు గివ్వన్ని మనుసున వెట్టరు. ఏమంటివుర శెంకరయ్య. గీ ఎండకాలంల లగ్గం జేద్దామా? పొల్లకు!" అన్నడు లింగయ్య.

"కుదుర్తె నేం గాందంటన్నానె నాయిన్న! చేసేద్దాం" అన్నడు శెంకరయ్య.

"ఇంట్లుండి కుదురన్నంటె కుదుర్తదా?"

ఆడిపోరగాండ్లున్నోడు కాలుకుబట్ట గుట్టకుంట తిరుగాలె. మన గరుజు[64] గద!" అన్నడు లింగయ్య.

"రొండు మూడు సంబంధాలు మాచూసిన. కని నాకు నచ్చలే. ఓటుంటె ఓటిలేదు.

"కొంచెమాల్చైమైనా సరెగని కొద్దిగంతో తీరుగున్న సంబంధమే సూడాలె బిడ్డ. లగ్గమయినంక పొల్ల ఎదరిసూడకుంట బతుకాలె"

"నువ్వన్నమాట నువ్వద్దే లింగన్న. నా కొడుకు బిడ్డకో సదువుకున్నోన్నే సూసి లగ్గం జేసిండు.

ఇద్దర్ని మనోడే సాదవల్సత్తందిప్పటిగ్గూడ. అందుకోసురమాడిపల్ల నిచ్చేటప్పుడు ఎనుకముందు బాగాలోసన జెయ్యాలె. ఉరుకులాడద్దు".

"లేనోడు సంపాయించుకుంటడు. ఉన్నోడు పాగొట్టుకుంటండు. పైస శాశ్వితంగుంటాదె. పొల్లగాడు బుద్ధిమంతుడు గావాలె. పొల్లను తిప్పల వెట్టుకుంట సాదుకునెటోడయితె సాలు.......'

"గట్లని పొల్లకు లేకిడోన్ని సూసి మెడగ్గట్టుమంటవా రాజమల్లు" అన్నడు వెంకటయ్య.

"నేం గట్లంటలేను. సంగతి[65] మాట సెప్పినంతే".

"సిన్నదో పెద్దదో ఇంతంత నౌకరున్నోడైతె నయ్యం. పొల్ల సదువుకున్నదాయె. నీడపట్టుకన్నుంటది' అంది శాంతమ్మ.

"నౌకరిగాడు గావన్నంటె మాటలానె అక్క! ఎంత లేదన్నా నలుపయివేలన్న పొయ్యాలె. మల్ల మీద పెట్టేటియి పెట్టాలె" అన్నడు వెంకటయ్య.

"ఇయ్యాల్ల రేపటి పోరగాండ్ల నేమన్న అనచ్చేటట్టుందా? గా గొల్ల సూపర్వైజరెల్లయ్య లేడా? గయినె బిడ్డెకు డాకుటరు సంబంధం గావన్నని పోతె మూడు లచ్చలడిగిండట. గన్ని పైసలిచ్చిగయినెకిచ్చేదేందో నాకైతె తెలువది" అన్నడు లింగయ్య.

"గొల్ల కులంల గంతెవ్వలిత్తరు గని గా సంబంధం కుదిరిందా మరి?"

"రొండు లక్షలకు కుదిరిందట. ఇప్పటిపొల్ల గండ్లనమ్ముడు కట్టముంది. లక్షిచ్చి తిరుపతిరెడ్డి బిడ లగ్గం జేత్తె తేపకోపారి కొట్టి పైసల్దెమ్మనుడేనాయె. రోత గాడ్దికొడుకు. థూ నీ యవ్వ గట్ల జేత్తారె" అని తుపుక్కునూంచిండు లింగయ్య.

"ఇగ ఆడిపోరగాండ్ల రాతెట్లుంటె గట్లయితది. అల్లను కనుడు మనసేతులుంది గని అల్ల రాతలు మన సేతులున్నాయా? గా పంతులు పెద్దబిడ్డ బాగుషారుండె. మంచిదాయె. గామెకేమొ సిన్న నైకరిగాడు దొరికె. సదువంటెనే పట్టింపులేని సిన్నామెకేమొ డాకుటరు దొరికె. గామిప్పుడు మొగన్తోని అమెరికలుందట. మా మనుమడు సెప్పిండు" అన్నడు రాజమల్లు.

అల్ల మాట లొడిసేతట్టు లెవ్వని నేనన్న లింగయ్యతోని "తాత నీ మనుమరాలు లగ్గానికేం బెడుతవు నువ్వు" అని.

"నాకు సాతనైనకాడికి నేంబెడుత. లగ్గానికయ్యే తిండికర్సంత నేనే ఎల్లదీత్త"

"సారుకు నలుగురాడోల్లాయె. ఇంతంత వరదక్షిణ సదురవా ఏంది?"

"నా దగ్గెరెల్లినంక అల్లగ్గాకుంటెవ్వలకు పెడుత? ముగ్గురు కొడుకులగ్గలిసి పదిమంది మనుమలు, మనుమరాండ్రున్నరు. అందరికి సమానంగనే పెడుత. అయితె మానాయెగని నీ ఎరుకలెవ్వలన్న మొగపొల్లగాండ్లుంటె సూడలేవు పిలగ, అరిగిపోతవా?"

మా సూత్త గని సెరువును తలాపుకు పెట్టుకొని చేప పిల్లకేడ్సినట్టుంది తాత నీ సంగతి"
"ఏంది? నువ్వేమంటున్నవో నాకయితె తెల్తలేదు".
"నీ కొడుకు బామ్మర్ది లేడా తాత. గా సుదాకర్. ఐ.టి.ఐ. ఐపాయె. అప్రెంటిష్ సెయ్యవట్టె. ఇంకో ఆర్నెల్లయితె నాకరయితది. గయినెకిత్తె సొప్పల సొప్ప గల్సినట్టుంటదింది!" అన్న నేను.
"మంచోనివే ఉన్నవ్ తియ్యి. పెద్ద మనిషని పేరంటం పిలిత్తె గిద్దెడు పసుపు ముడ్డికి రాసుకున్నదట నీ అసొంటిది. మా పేద్ద సంబందం గురించే సెప్పినవు. అల్లింటి పొల్లను మా ఇంటికి సేసుకొని మల్ల అల్లింటకి మా పొల్ల నిచ్చుడా? సూరునీల్లు ఎనగ్గర వెక్కుతయా? మంచోనివే' కారెడ్డంగన్నడు లింగయ్య.
"ఏముంది తాతిత్తె. సంబంధం మంచిదయితె ఐపాయె గద"
"సాల్తియ్యి. మాట్లాడకు. అల్లు మా కాల్లు మొక్కుతరు మేము అల్లకాల్లు మొక్కుతమా? మా శెంకరయ్య బామ్మర్ది కాల్లు మొక్కి పిల్లనియ్యన్నా? ఎవ్వలన్న ఇన్నా మానంబోత దూకో"
"ఎవ్వలకాల్లెవ్వలు మొక్కుడెందుకు?" మొక్కకుంటయిపాయె" నవ్వుకుంటన్న నేను.
"కన్యాదానం సేసినప్పుడు కాల్లు కడుగద్దా? మ్యానకోడల్ను సేసుకుంటెట్ల పాడైతది? గదేమన్న ఇలవర్సేనా? కోపంగన్నడు లింగయ్య.
"గిప్పుడు గవ్వన్నెవ్వలు సూత్తలేరు తాత! గా ఆంధ్ర దిక్కు పొయ్యిసూడు. సానమంది కోడలు వరుసనే లగ్గం జేసుకుంటరు" అన్న నేను.
"అక్కడ సేసుకుంటె సేసుకోనియ్యి. ఎక్కడిలవర్సె అక్కన్నే. మ్యానమామకు కోడల్నిచ్చుడేంది? బామ్మర్ది కాల్లు బావ మొక్కుడేంది?"
"గిప్పుడు మనదిక్కు గూడ గా అవుసులయినె చారి, ఎల్లాపయినె శ్రీనివాసరావు సేసుకున్నరు" అన్నడు వెంకటయ్య.
"థట్ నీ యవ్వ! నువ్వుకో......సదువేత్తే ఉన్న మతి పెయిందట. మీ బామ్మర్ది సంబందంకంటె మంచి సంబంధం నేం జూత్త. కట్నమెక్కో ఐన మంచిదే నేను కొంతిత్త. బెలటోల్లు దొరికిండ్రు నీ యవ్వ అన్నాయెంపాడుగాను........కోడల్ను సేసుకుంటరట. సిగ్గులేక బామ్మర్ది కాల్లు మొక్కుతరట. లగ్గమయినంక ఆ పొల్లగాడక్కను అక్కని పిలువన్నా? అత్తనా? పొల్ల మామనేమని పిలువాలె? ఛీ నీ యవ్వ సదువుకున్నొల్లకంటె సాకలోడే నయ్యం. బలె మనుషులు పొండ్రి" అని లేచి ఇంట్లకు ఎల్లిపెయిండు లింగయ్య.
నేను లేచి నవ్వుకుంటెల్లిపెయిన.
ఒక్కొక్క జాగల ఒక్కొక్క తీరలవాట్లున్నయి. మా తెలంగాణ కోడల్ను లగ్గంజేసుకునుడు ఒకప్పుడస్సలే లేకుండె. గిప్పుడు మా సేసుకుంటండ్రు. కని ఎంతైనా గా ఆంధ్ర దిక్కున్నట్టు ఇప్పటిగ్గూడ లేదు.